
గోదావరి ఒడ్డున సమ్మక్క, సారక్క గద్దెలు మునిగి ప్రవహిస్తున్న వరద నీరు


వరద నీటితో సమీప ఎన్టీఆర్ కాలనీలోని ఇళ్ల వద్దకు చేరిన వరద నీరు


వరద నీటిలో మునిగిన గౌతమేశ్వరాలయం


వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్


గోదావరి వరద నీటిలో మునిగిన పంట పొలాలు

ఉగ్ర గోదావరి

మంచిర్యాలటౌన్: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో, 40గేట్లను ఎత్తారు. వరద నీటిని గోదావరి నదిలోకి వదిలారు. జిల్లా కేంద్రంలోని గౌతమేశ్వరలాయం , సమ్మక్క సారలక్క గద్దె వరద నీటిలో మునిగింది. రాళ్లవాగులోకి వరద నీరు చేరి, సమీపంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీ, పద్మశాలీ కాలనీలోని సమీప ఇళ్ల వద్దకు వరద నీరు వచ్చి చేరింది. వాగు సమీపంలోని కాలనీ ప్రజలు ఇంట్లోని సామగ్రితో ఇళ్ల బయటకి వెళ్లారు. వరద బాధితుల కోసం వసతిని ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు తిరిగి సామగ్రిని తీసుకుని ఇళ్ల వద్దకు వెళ్లారు. పాతమంచిర్యాలతో పాటు, మంచిర్యాల పరిసరాల్లోని పంట వరద నీటికి మునిగిపోయింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ కుమార్‌దీపక్ గోదావరి వరద ఉధృతిని పరిశీలించి, లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

మంచిర్యాలక్రైం: గోదావరి ప్రవాహన్ని తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. కొందరు సెల్ఫీలు, ఫొటోలు దిగారు. ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్ రావు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముంచెత్తిన గోదావరి వరద

శ్రీరాంపూర్: నస్పూర్ మండల పరిధిలో తీరం వెంట ఉన్న పంటపొలాలను గోదావరి వరద ముంచెత్తింది.


గోదావరి ప్రవాహాన్ని తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు

క్లుప్తంగా

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి మండల విద్యాధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల విద్యాధికారులు పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

లక్ష్యసాధనకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

మందమర్రిరూరల్: ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు గుర్తింపు యూనియన్ నేతలు సహకరించాలని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. జీఎం ఆఫీస్ ఆవరణలో గురువారం గుర్తింపు కార్మిక సంఘం నేతలతో నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ నేతలు ఏరియాలో పలు సమస్యలు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. జీఎం మాట్లాడుతూ.. తమ పరిధిలోని సమస్యలు తప్పకుండా తీర్చుతామని, బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు అక్బర్‌అలీ, మల్లేష్, సుదర్శన్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, కేకే గ్రూపు ఏజెంట్ రాంబాబు, సివిల్ ఎస్ఈ రాములు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సౌకర్యాలు

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ మహిళా ఉద్యోగులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తుందని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. జీఎం ఆఫీస్ ఆవరణలో గురువారం మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిశు సదన్, పార్కింగ్‌ను ప్రారంభించారు.

ఆదివాసీల నిరసన


నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్, కవ్వాల్ అటవీ సెక్షన్, సోనాపూర్ తాండా బీట్, పాలగోరీల ప్రాంతంలో సర్వే నంబర్ 112లో తమ పూర్వీకుల భూమి ఉందని, ఇప్పటికీ మా వద్ద పహానీలు ఉన్నా, అటవీ అధికారులు ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని నిరసిస్తూ గురువారం జైనూర్, సిర్పూర్, మండలాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు జన్నారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జైవంతరావు, రాజు, పటేల్‌లు మాట్లాడారు. అనంతరం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు సమస్య తెలిపి పరిష్కారం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమకు ఆ భూమి దక్కేంత వరకు పోరాటం చేస్తామని, అక్కడే గుడిసెలు వేసుకొని నివాసం ఉంటామని ఆదివాసీలు పేర్కొన్నారు.

6న వినాయక నిమజ్జనం

మంచిర్యాలఅర్బన్: వినాయక నిమజ్జనం సెప్టెంబర్ 6న నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ సమితి ఒక ప్రకటనలో పేర్కొంది. అనంత చతుర్థశి రోజున నిర్వహించటానికి వేద పండితులైన దామోదర్‌శర్మ, నరహరిశర్మ, విశ్వేశ్వరశర్మ, వేదం రామక్రిష్ణలు నిర్ణయించారని సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మకుండా 6న వినాయక నిమజ్జన కార్యక్రమం ఉంటుందని తెలిపింది.


చెన్నూర్‌లో గణేశ్ ఆగమన యాత్ర



మంచిర్యాలఅర్బన్: ఎస్సీ బాలికల వసతిగృహంలో ప్రత్యేక పూజలు


శ్రీరాంపూర్: సీతారాంపల్లి రోడ్‌లోని శ్రీవెంకటేశ్వర టౌన్‌షిప్‌లో

కొలువుదీరిన గణనాథుడు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఊరూరా, వాడవాడలా గణనాథుడు కొలువుదీరాడు. మండపాలను రంగు రంగుల విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. వినాయక ఉత్సవ విగ్రహాలను బుధవారం భాజా భజంత్రీల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. విభిన్న రూపేణా గణపతి దర్శనిమిస్తుండగా, భక్తులు గురువారం నైవేధ్యాలు సమర్పించి పార్వతీ తనయుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పాత మంచిర్యాలలో డీసీపీ భాస్కర్, పాత మంచిర్యాల ఎల్ఐసీ కాలనీలో వినాయకుడిని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు దర్శించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. తొమ్మిది రోజుల పాటు వినాయకుడు పూజలు అందుకోనున్నాడు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గణపయ్య విగ్రహ ప్రతిష్ఠలో కమాండెంట్ వెంకటరాములు దంపతులు పాల్గొన్నారు.


జన్నారం: పూజల్లో పాల్గొన్న భక్తులు


మంచిర్యాలఅర్బన్: సంజీవయ్యకాలనీలో...


దండేపల్లి: గూడెంలో మట్టిగణపతికి పూజలు


కోటపల్లి: మట్టి గణపతికి పూజలు


భీమారం: సాయిరాం యూత్ ఆధ్వర్యంలో...


ఎల్ఐసీ కాలనీ(లేబర్‌కాలనీ) విద్యుత్‌కాంతుల్లో బొజ్జగణపతి


జైపూర్ ఎస్సీ కాలనీలో భారీ గణపయ్య


జైపూర్: హనుమాన్ ఆలయంలో పూజలు


మంచిర్యాల మెడికల్ కాలేజీ ఆవరణలో...


మందమర్రిరూరల్: మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో..


భీమారం: ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో....


పాత మంచిర్యాలలో వినాయకుడి వద్ద డీసీపీ


చెన్నూర్‌రూరల్: అక్కెపల్లిలో భక్తుల పూజలు


లక్సెట్టిపేట: మహాలక్ష్మి వాడలోని 20 అడుగుల వినాయక ప్రతిమ


తాండూర్: వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అయోధ్య బాల రాముని రూపంలో మట్టి వినాయకుడు


గుడిపేట బెటాలియన్‌లో పూజల్లో పాల్గొన్న కమాండెంట్ దంపతులు

సంక్షిప్త వార్తలు

బీజేపీ జిల్లా పదాధికారుల నియామకం

మంచిర్యాలటౌన్: బీజేపీ జిల్లా పదాధికారులను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టి వెంకటకృష్ణ, జోగుల శ్రీదేవి, అక్కల రమేశ్, పబ్బతినేని కమలాకర్‌రావు, కోడి రమేశ్, ముత్తె సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా దుర్గం అశోక్, ఎనగందుల కృష్ణమూర్తి, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శులుగా రాచర్ల సంతోశ్, వైద్య శ్రీధర్, రత్న లక్ష్మీనారాయణరెడ్డి, రాంగోని మహిందర్‌గౌడ్, ఠాకూర్ ఉదయశ్రీ, మంత్రి సురేఖ, కోశాధికారిగా రమేశ్ జైన్, కార్యాలయ కార్యదర్శిగా తోట మల్లిఖార్జున్, సోషల్ మీడియా ఇంచార్జిగా మెట్టుపల్లి జయరామరావు, మీడియా కన్వీనర్‌గా పల్లె రాకేశ్, ఐటీ ఇంచార్జిగా ముచ్చకుర్తి కిషోర్‌ను నియమించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట/భీమారం: భీమారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, లక్సెట్టిపేట మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల విద్యార్థులు ధనిష్, అఖిల్, సాహిత్, కె.శ్రీకాంత్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు భీమారంలో హెచ్ఎం శ్రీనివాస్, పీడీ మారయ్య, లక్సెట్టిపేటలో ప్రిన్సిపాల్ మంగ తెలిపారు. క్రీడాకారులు ఈ నెల 26న మంచిర్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

పోరాటాల వారసత్వాన్ని కొనసాగించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాల వారసత్వాన్ని కొనసాగించాలని సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) కార్యదర్శి అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీల అండదండలతో యాజమాన్యం పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తుందన్నారు. లాభాల్లో పర్మినెంట్ కార్మికులకు 40శాతం వాటా, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.30వేలు తగ్గకుండా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐఎన్టీయూసీ నేత జనక్ ప్రసాద్ పైరవీలతో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, మంత్రుల సేవలో మునిగిపోతున్నారని తెలిపారు.

టీబీజీకేఎస్ నిరసన

కాసిపేట: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. చలో కొత్తగూడెం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు ప్రతాప్, సారంగపాణి, వెంకటేష్, రాజన్న, తిరుపతి, రాజ్‌కుమార్, సత్యప్రసాద్, జగన్, తేజ, ప్రభాకర్, రాజేష్ తదితరులు ఉన్నారు.

తూతూ మంత్రంగా ఈజీఎస్ ప్రజావేదిక

కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం డీఆర్డీవో కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక తూతూ మంత్రంగా సాగింది. రికవరీలు, జరిమానాలు ఏం విధించలేదు. సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, అధికారులు మినహా కూలీలు ఎవరూ హాజరుకాలేదు. వర్షం పేరుతో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావేదికలో సోషల్ ఆడిట్ సభ్యులు గుర్తించిన లోపాలను అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు చర్చించుకొని ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సబ్బర్ అలీ, సామాజిక తనిఖీ బృందం ఎస్టీఎం వేణు, ఎస్ఆర్‌పీ సాయిలు, ఈజీఎస్ ఏపీవో నవీన్, ఈసీ మల్లేష్, ఈజీఎస్ టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్‌లు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘ఉనికి కోసమే టీబీజీకేఎస్ నిరసనలు’

తాండూర్: కార్మిక క్షేత్రంలో తమ ఉనికిని కాపాడుకునేందుకే టీబీజీకేఎస్ యూనియన్ సింగరేణి వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు అంటూ కొత్త నాటకం మొదలుపెట్టిందని ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ డెప్యూటీ కార్యదర్శి సంఘం ప్రకాష్ గురువారం ఒక పత్రిక ప్రకటనలో విమర్శించారు. ఐఎన్టీయూసీపైన గాని, కాంగ్రెస్ పైన గాని విమర్శలు చేస్తే తగిన రీతిలో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

కాంట్రాక్ట్ కార్మిక సంఘంలోకి విలీన గ్రామాల కార్మికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన ఐదు గ్రామాల్లోని కార్మికులు గురువారం మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ సమక్షంలో కార్మిక సంఘంలో చేరారు. విలీన గ్రామాల్లోని కాంట్రాక్ట్ కార్మికులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఓటర్ జాబితా ప్రదర్శన

కోటపల్లి/కాసిపేట/తాండూర్: త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాండూర్, కాసిపేట, కోటపల్లి మండలాల్లోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఓటర్ జాబితాను ప్రదర్శించారు.వార్డుల వారీగా ప్రదర్శించిన ఈ జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే ఓటర్లు రెండు రోజుల్లోగా అధికారులకు ఫిర్యాదు చేసి సరి చేసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు సూచించారు. సవరణ అనంతరం సెప్టెంబర్ రెండో తేదీన తుది జాబితాను అధికారులు ప్రకటించే అవకాశం ఉంది.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సమగ్రశిక్ష, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డీఈవో యాదయ్య తెపారు. ఈ నెల 30న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శిబిరం నిర్వహించనున్నట్లు దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం, హాజీపూర్, నస్పూర్, మంచిర్యాల, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు కావాలన్నారు. సెప్టెంబర్1న ప్రభుత్వ ఉన్నత పాఠశాల బెల్లంపల్లిలో ఏర్పాటు చేయనున్న శిబిరం బెల్లంపల్లి, మందమర్రి, కాసిపేట, తాండూర్, భీమిని, కన్నెపల్లి, నెన్నెలకు దివ్యాంగ విద్యార్థులు హాజరు కావాలన్నారు. 18ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన వినికిడి యంత్రం, వీల్‌ఛైర్, మూడు చక్రాల సైకిల్, స్కూటర్, కృత్రిమ అవయవాలు, స్మార్ట్ ఫోన్లు పొందటానికి శిబిరంలో నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే విద్యార్థులు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధృవపత్రం, రేషన్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు తీసుకొని రావాలన్నారు. పూర్తి వివరాలకు 83283 63596లో సంప్రదించాలన్నారు.